క్లుప్తంగా

ప్రజలకు ఎమ్మెల్యే ఉదయభాను సంక్రాంతి శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: భోగి, సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియోజకవర్గ ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని, ఈ పండుగలు వారి జీవితాల్లో సరికొత్త క్రాంతిని నింపాలని కోరారు. సుఖ సంతోషాలు, భోగ భాగ్యాలు నింపాలని, అలాగే అన్నదాతలు పాడిపంటలు, సిరిసంపదలతో తలతూగాలని ఆకాంక్షించారు.

అమ్మవారి గోశాలకు వరిగడ్డి వితరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ గోశాలకు శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన రైతు చింతా వెంకటరావు రూ. 7వేల విలువైన వరిగడ్డిని వితరణగా అందజేశారు. ఆలయ ఉద్యోగి శశి, తదితరులు పాల్గొన్నారు.

మరియనివాస్‌లో సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకలలో సందడిగా విద్యార్థులు

నందిగామ: పట్టణ శివారు సిలువ గిరి సమీపంలో గల మరియనివాస్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు భోగి పండ్లు పోశారు. హరిదాసు వేషధారణతో పాటు పలు రకాల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు శోభారాణి హాజరయ్యారు.

అమ్రితసాయిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు జరుపుకొన్నారు. కళాశాలలో విద్యార్థినులు రంగవల్లులు వేసి, కోలాట ప్రదర్శన చేశారు. భోగి పళ్లు, పశువుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. గాలిపటాలు ఎగురవేశారు. వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగిమంటలు వేసి, సంక్రాంతి పాటలు పాడారు. గంగిరెద్దు విన్యాసాలను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డాక్టర్ కె.సాయిమనోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన గిల్లి సుమన్, నాగిని దంపతులకు నిత్యావసర సరుకులను అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడేపల్లి సోమేశ్వరరావు అతిథిగా పాల్గొని నెలకు సరిపడిన సరుకులను అందజేశారు. వాసవి కపుల్స్ ప్రతినిధులు సత్యనారాయణ, కొత్త రమేష్‌కుమార్, కొత్త పురుషోత్తం, కృష్ణారావు, కొండ, చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గయ్యపేట అర్బన్: ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకొని కాలిన గాయాలతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిన ఘటన పట్టణంలోని స్థానిక చెరువు బజారులో చోటుచేసుకుంది. ఎస్ఐ. బీవీ రామారావు కథనం ప్రకారం.. తాళ్లూరి మధు (33) ఈనెల 7 వ తేదీన రాత్రి మద్యం తాగిన మైకంలో భార్యతో గొడవ పడి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు పేట ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్స పొందుతూ ఈనెల 12 వ తేదీ రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

23న సొసైటీ పాలక వర్గ ఎన్నిక

పైడూరుపాడు (విజయవాడ రూరల్): పైడూరుపాడు గ్రామంలోని మత్స్యకారుల సొసైటీ పాలకవర్గం ఎన్నిక ఈ నెల 23వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అఖిల తెలిపారు. గ్రామానికి చెందిన 56 మంది ఓటర్లు మత్స్యకారుల సొసైటీలో ఉన్నారని, వీరు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు. 2023వ సంవత్సరంలో ఎన్నికయ్యే నూతన పాలకవర్గం అయిదేళ్ల పాటు అధికారంలో కొనసాగుతుందని పేర్కొన్నారు.

నామినేటెడ్‌లో కూడా మహిళలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- కంచికచర్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మల్లేశ్వరి ప్రమాణస్వీకారం



కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మల్లేశ్వరితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఏఎండీ రవికుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల్లో కూడా మహిళలకు ప్రముఖ స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో పాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులన్నీ పురుషులకు మాత్రమే దక్కేవని, సీఎం జగన్ పాలనలో మగవారికి దీటుగా మహిళలకు సమాన హక్కు కల్పించారన్నారు.

కష్టానికి తగిన ప్రాతినిధ్యం :ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు సముచిత స్థానం కల్పించారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. రైతు కుటుంబానికి చెందిన కోటేరు మల్లేశ్వరిని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా నియమించారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిన నాటి నుంచి కోటేరు కుటుంబాలు పార్టీకి విధేయతగా పనిచేశాయన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా కోటేరు మల్లేశ్వరి, వైస్ చైర్మన్‌గా మాడుగుల శంకర్‌లతోపాటు డైరెక్టర్లతో జిల్లా ఏడీఎం రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కంచికచర్ల, వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచి వేల్పుల సునీత, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మార్త రజిని, బొమ్మిశెట్టి భాస్కరరావు, ఆవల రమేష్, కాలవ పెదబాబు, వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నన్నపనేని నరసింహారావు, కాలవ వాసుదేవరావు, చింతా రవీంద్రనాథ్, బండి జానకిరామయ్య, కోదాటి రామకృష్ణ, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్



గండేపల్లిలో పొట్టేళ్ల పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

కంచికచర్ల: సంక్రాంతి పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగుదనం ఉట్టిపడే పండుగ అని, ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లిలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా సంక్రాంతి పర్వదినం సందర్భంగా సంప్రదాయబద్ధంగా జరిగే పొట్టేళ్ల పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎటువంటి హింస లేకుండా పొట్టేళ్ల పోటీలు జరగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు పరిటాల రాము, పరిటాల వీరభద్రరావు, ఆవల రమేష్‌బాబు, నూకార్జున, మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాబార్డ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా



హస్తకళల ప్రదర్శనకారులకు జ్ఞాపికలను అందిస్తున్న గంగాధర్

పటమట(విజయవాడతూర్పు): గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రదర్శనతో కూడిన మార్కెట్, కొనుగోలు మద్దతు అందించి సహకరించిన నాబార్డ్ వారి సాయం ఎంతో సంతృప్తి కలిగించిందని శిల్ప గురు జాతీయ అవార్డు గ్రహీత కె. గంగాధర్ అన్నారు. శుక్రవారం పటమట పంట కాల్వ రోడ్డులోని స్టెల్లా కాలేజ్ ఆడిటోరియంలో జరిగిన నాబార్డ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా ప్రదర్శన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళ, చేనేత వస్త్ర పరిశ్రమ, నైపుణ్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాబార్డ్ వంటి సంస్థల సహకారం అద్భుతమని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పోచంపల్లి, పొందూరు, వెంకటగిరి, మంగళగిరి, మహేశ్వరీ, కలంకారీ, కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతిలో కొనసాగుతున్న చేనేత వస్త్రాల తయారీకి తోడు చెక్కబొమ్మలు, గాజు, లెదర్, జూట్ వంటి ముడిసరుకుతో స్టాళ్లలోనే పలు వస్తువులను తయారు చేయడంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేయడం ఈ ప్రదర్శనలో మరో ప్రత్యేకతని ఆయన అన్నారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయభాస్కర్ మాట్లాడుతూ మహిళా సంస్థల ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాబార్డు సంస్థ సహకారంతో ప్రదర్శనతో కూడిన అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఎస్. రెడ్డి, నాబార్డ్ డీజీఎం కేవీఎస్. ప్రసాద్ ఎం.ఎస్.ఆర్. చంద్రమూర్తి, మిలింద్ చౌసల్కర్, మేరాలాల్, మహంతి, హరీష్, స్థానిక బ్యాంకు కాలనీ, టీచర్స్ కాలనీ, పోస్టల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

కీసర టోల్‌గేట్ వద్ద పెరిగిన రద్దీ



కీసర టోల్‌గేట్ వద్ద భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

నందిగామ: సంక్రాంతి పర్వదినాల నేపథ్యంలో కంచికచర్ల మండలం కీసర స్వర్ణ టోల్‌గేట్ వద్ద శుక్రవారం వాహనాల రద్దీ అధికమయింది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో వివిధ గ్రామాలకు తరలి వెళ్లే వారి సంఖ్య గణనీయంగా ఉండటంతో టోల్‌గేట్ కౌంటర్లు ఏ సమయంలో చూసినా రద్దీగానే కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఫాస్ట్ ట్యాగ్ అమల్లో ఉండటంతో గతంలో కూడా పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. వందల సంఖ్యలో వాహనాలు వస్తున్నప్పటికీ క్షణాల్లో వెళ్లిపోతున్నాయి. దీనికి తోడు పోలీసులు కూడా ప్రత్యేకంగా బీట్‌లు ఏర్పాటు చేశారు. దీనిపై స్వర్ణ టోల్‌వేస్ మేనేజర్ ఎం.జయప్రకాష్‌ను ప్రశ్నించగా సాధారణంగా నిత్యం 18 నుంచి 20 వేల వరకు వాహనాలు వస్తుంటాయని, గత రెండు రోజులుగా వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కీసర టోల్ ప్లాజా వద్ద మొత్తం వాహనాలు వెళ్లేందుకు 10 లైన్లు ఉన్నాయని, అన్ని కౌంటర్లలో ఫాస్ట్ ట్యాగ్ సౌకర్యం ఉందన్నారు. ఒక్కో వాహనం టోల్‌గేట్ నుంచి క్రాస్ అయ్యేందుకు కేవలం మూడు సెకండ్ల సమయం మాత్రమే పడుతుందన్నారు. గురువారం టోల్‌గేట్ నుంచి మొత్తం 28 వేల వాహనాల రాకపోకలు జరిగాయని, శుక్రవారం అర్ధరాత్రి దాటేంతవరకు ఇదే తరహాలో రద్దీ ఉంటుందన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రమేష్

పెనుగంచిప్రోలు: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రంగా మరొకరికి స్వల్ప గాయాలైన ఘటన కాజ్‌వే పై శుక్రవారం చోటు చేసుకుంది. అనిగండ్లపాడు వైపు నుంచి పెనుగంచిప్రోలు వస్తున్న బైక్, పెనుగంచిప్రోలు వైపు నుంచి వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వత్సవాయి మండలం కంభంపాడు గ్రామానికి చెందిన బేతంపూడి రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వల్లభి ప్రాంతానికి చెందిన వరిగల విజయ్‌బాబుకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రావ్యంగా సాగిన కచేరీలు



త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తున్న సాయికృష్ణ కౌశిక్

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శుక్రవారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీలు శ్రావ్యంగా సాగాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, కళాకారులు త్యాగరాజ స్వామి కృతులను మధురంగా ఆలపించారు. గండూరి సాయికృష్ణ కౌశిక్, లోల్లా జయరాం, ఎస్‌పీ ఆదిసుందరి, పీ నాగపూజిత, కుందుర్తి మాధవి, మొక్కపాటి హేమసుందర్, రాగంపూడి అమూల్య, కరియామిని, పారుపల్లి ప్రభానస్, పారుపల్లి ఇభానస్, శ్రీలయశ్రీనివాస్, శ్రీజ శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరంజని, కే.సుధీర్ శర్మ(ఆస్ట్రేలియా), వేమూరి విశ్వనాథ్, చిట్టా కార్తీక్, పోవూరి గౌరీనాథ్, త్యాగరాజ స్వామి రచించిన స్వరపరచిన కీర్తనలను ఆలపించారు.

15న పంచరత్న కృతుల గోష్ఠిగానం

త్యాగరాజ స్వామి సంగీతోత్సవాల ముగింపు సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఉదయం తొమ్మిది గంటలకు పంచరత్న కృతుల గోష్ఠిగానం ఉంటుందని, రెండువందలమంది సంగీత కళాకారులు ఉత్సవంలో పాల్గొంటారని సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- అల్లూరులో ఘనంగా ముగ్గుల పోటీలు
- ఆకట్టుకున్న కోలాటం, డప్పు కళాకారులు
- సందడి చేసిన సినీ నటులు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీవీ యాంకర్ ఉదయభాను తదితరులు

అల్లూరు(వీరులపాడు): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీకని, సంక్రాంతి వేడుకలు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోటేరు మల్లేశ్వరి, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అల్లూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో 300 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. బొమ్మారెడ్డి స్వర్ణలత న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

సందడి చేసిన సినీ నటులు..

ముగ్గుల పోటీలకు హాజరైన టీవీ, సినీ నటులు, యాంకర్లు దివి, ఉదయభానులతో పాటు గాయకులు అను, సుప్రియ, నాగరాజు గ్రామంలో సందడి చేశారు. వారిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. గాయకులు ఆలపించిన పాటలు ఆహూతులను అలరించాయి. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు ఏఎంసీ చైర్‌పర్సన్ మల్లేశ్వరి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి తమ సొంత ఖర్చుతో అందజేసిన బహుమతులను సినీ నటులతో కలిసి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన కవితకు ఫ్రిడ్జ్, రెండవ స్థానంలో నిలిచిన దీపికకు వాషింగ్ మిషన్, మూడవ స్థానంలో నిలిచిన నాగజ్యోతికి గ్రైండర్‌తో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సొలేషన్ బహుమతులను అందించారు. పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



కోలాటమాడుతున్న చిన్నారులు, మహిళలు

ఆకట్టుకున్న కోలాటం, డప్పు విన్యాసాలు..

ముగ్గుల పోటీల కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా ఈదర గ్రామానికి చెందిన దాసరి మాణిక్యాలరావు బృందం నిర్వహించిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చిన్నారులు నిర్వహించిన డ్యాన్స్‌లు మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వ్యవసాయాభివృద్ధి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు మంగునూరు కొండారెడ్డి, షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి పండుగ నేపథ్యంలో నందిగామలో కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు

గ్రామాల్లో సంక్రాంతి సందడి

నందిగామ: సంక్రాంతి పండుగ అనగానే సుదూర ప్రాంతాలలో ఉన్న వారు సైతం సొంత ఇళ్లకు చేరుకుంటారు. దాదాపు ప్రతి పట్టణం, గ్రామంలో కూడా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల రాకతో ఊళ్లు కళకళలాడుతున్నాయి. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శుక్రవారం నందిగామ బస్టాండ్ వచ్చి వెళ్లే ప్రయాణికులతో రద్దీగా కనిపించింది.

• పేటలో సంక్రాంతి శోభ

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంలో ఎటు చూసినా బంధువులు, మిత్రులతో ప్రతి ఇల్లూ కళకళ లాడుతోంది. ప్రతి ఇంటి ముంగిట మహిళలు రంగవల్లులను అందంగా అలంకరిస్తున్నారు. హరిదాసుల కీర్తనలతో వీధులు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. పిండి వంటలు చేసే పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు. చిన్నారుల ఆనందానికి హద్దులు లేకుండా పోవటంతో గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్నారు.

- జగ్గయ్యపేట అర్బన్







మంత్రి జోగి రమేష్‌ను కలిసిన తెలంగాణ మంత్రి



తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మంత్రి జోగి రమేష్ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కొండపల్లి బొమ్మ అందజేసి అభినందించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జోగి రాము, నల్లమోతు మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 1995–1998 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. కళాశాలలో తమ తోటి విద్యార్థులతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన అధ్యాపకులను, ప్రస్తుత కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావును సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు చంద్రశేఖర్, మట్టం రాజుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది.

మాజీ ఎంపీ కేపీ రెడ్డియ్య మృతి బాధాకరం

ఇబ్రహీంపట్నం: మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లిమర్ల వరప్రసాద్ అన్నారు. రెడ్డయ్య మృతిపై ఓబీసీ సంఘం తరపున ఇబ్రహీంపట్నంలో శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తొలిసారిగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టిన మొదటి వ్యక్తని కొనియాడారు. ఆయన మృతి బలహీన వర్గాల హక్కుల ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే పార్థసారధి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

1న ధ్యాన మందిరం ప్రారంభం

మైలవరం: స్థానిక శ్రీకంచి కామాక్షిదేవి ఆలయం పక్కన నిర్మించిన శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరం వచ్చేనెల 1న ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వంశస్తులు శ్రీవీరభద్రస్వామి, లక్ష్మీ భ్రమరాంబిక దంపతులు హాజరవుతారన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి సుప్రభాత సేవ, అభిషేకం, సహస్రనామార్చనలు, వివిధ భక్త సమాజముల ఏకనామ సంకీర్తన, భజనలు, హనుమాన్ చాలీసా, చివరి రోజు స్వామివార్ల కల్యాణం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కోడి పందేల బరి ధ్వంసం

మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. మండలంలో కోడి పందేల బరులు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటిని ధ్వంసం చేస్తామని ఎస్ఐ రాంబాబు హెచ్చరించారు.